సంక్షేమం, అభివృద్ధే బీఆర్ఎస్ ధ్యేయం


బచ్చన్నపేట: బసిరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి


కేసిరెడ్డిపల్లి ప్రచారంలో పాల్గొన్న గ్రామస్తులు

- పార్టీ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

బచ్చన్నపేట: సంక్షేమం, అభివృద్ధే బీఆర్ఎస్ ధ్యేయమని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందని పార్టీ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బసిరెడ్డిపల్లి, కొడవటూర్, కేసిరెడ్డిపల్లి, ఛోనకొల్లూర్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, కోలాటాలతో గ్రామస్తులు పల్లాకు అడుగడుగునా నీరాజనం పలికారు. అనంతరం పల్లా మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉన్న పార్టీలు ఇక్కడి సమస్యలను పట్టించుకోకుండా వదిలేశాయని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

పార్టీలో పలువురి చేరికలు..

మండలంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, చేర్యాల మండలం ఎలికట్టె గ్రామ సీపీఎం నాయకులు, సాల్వాపూర్ మాజీ సర్పంచ్‌లు బండకింది శింగరయ్యగౌడ్, బాల్‌లక్ష్మిలు పల్లా సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి, మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మల్లవరం అరవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన కేయూ విద్యార్థి సంఘాలు


జనగామ: విద్యార్థి సంఘాల నాయకులను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న పల్లా


పార్టీలో చేరిన వారితో పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: బీఆర్ఎస్ జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం వికాస్‌నగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయ ఆవరణలో మలిదశ తెలంగాణ విద్యార్థి ఉద్యమ కారులు, కేయూ విద్యార్థి సంఘాల నాయకులు గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకుల తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేశారన్నారు. గడిచిన 15 ఏళ్లుగా విద్యార్థుల పక్షాన పోరాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు నచ్చి తమకు మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంపై ఆంధ్రపార్టీలతో కలిసి కుట్రలు చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా తెలంగాణ యువత బీఆర్ఎస్‌తో కలిసి వస్తున్నారని చెప్పారు. కేయూ జేఏసీ వ్యవస్థాపక సభ్యులు ఇడంపాక విజయ్ కన్నా, సీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్ కుమార్, గిరిజన శక్తి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోత్ రాజు నాయక్, జేఏసీ కో కన్వీనర్, కొండపాక రాకేష్, ప్రశాంత్ తదితరులకు పల్లా గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. సోషల్ మీడియా ఇన్‌చార్జ్ రాజకుమార్ ఉన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టండి

మద్దూరు(హుస్నాబాద్)/చేర్యాల(సిద్దిపేట): బీఆర్ఎస్‌కు ఓటు వేసి అభివృద్ధికి అండగా నిలవాలని ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే చేర్యాల పట్టణ కేంద్రంలో జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ యూత్ నాలుగు మండలాల ఇన్‌చార్జ్ శివగారి అంజయ్య ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు సోమయ్య, ఉపేందర్, శ్రీనివాస్, గణేష్, బాబు, బాలరాజు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు..

చేర్యాల మండల పరిధిలోని నాగపురి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎంపీపీ కరుణాకర్ ఆధ్వర్యంలో జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే కొమురవెల్లి మండల పరిధిలోని తపాస్‌పల్లికి చెందిన వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పల్లా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆకునూరు బీజేపీ వార్డు సభ్యులు పల్లా సోదరుడి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

పల్లా గెలుపునకు పాదయాత్ర

బచ్చన్నపేట: కొన్నె గ్రామం నుంచి కొడవటూర్ సిద్దేశ్వరాలయం వరకు బీఆర్ఎస్ నాయకులు గురువారం పాదయాత్ర చేపట్టారు. మండల కేంద్రంలోని అమర వీరులస్తూపం వద్ద నివాళులర్పించి సిద్దేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు.

పల్లాను ఆదరించాలి

పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఆదరించి గెలిపించాలని బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు వడ్లెపల్లి ఉపేందర్ రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలోని పలు వార్డుల్లో ఆయన ఇంటింటా ప్రచారం చేశారు.

ప్రభుత్వ స్కీములన్నీ స్కాములే


వృద్ధులను ఓట్లు అడుగుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి


బైరాన్‌పల్లి బురుజు వద్ద నివాళులర్పిస్తున్న కొమ్మూరి

- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 'ఆరు గ్యారంటీ'లు అమలు
- పార్టీ జనగామ అభ్యర్థి 'కొమ్మూరి'

మద్దూరు(హుస్నాబాద్): రాష్ట్ర ప్రభుత్వ స్కీములన్నీ స్కాములేనని కాంగ్రెస్ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం దూల్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి, తోర్నాల, బెక్కల్, కొండాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను అప్పులమయం చేశారని మండిపడ్డారు. యువతకు ఉద్యోగ అవకాశాలు లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వాపోయారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను మంజూరు చేయించానని తెలిపారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీని విమర్శించడం సరికాదన్నారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి భూకబ్జాలు తప్ప నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. జనగామను దోచుకునేందుకే సీఎం కేసీఆర్ పల్లాకు టికెట్ ఇచ్చారని విమర్శించారు. స్థానికేతరుడికి టికెట్ ఇచ్చినా కూడా బీఆర్ఎస్ నాయకులు ఇంకా ఆ పార్టీలో ఎందుకు ఉంటున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్సీగా ఒక్కనాడు నియోజకవర్గానికి రాని పల్లా ఇప్పుడు వచ్చి ఏం చేస్తాడన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను 100 రోజుల్లోనే అమలు చేస్తామన్నారు. రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు బైరాన్‌పల్లిలో అమరుల స్తూపం, బురుజు వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నాగపూరి రాజలింగం, జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు, బైరాన్‌పల్లి సర్పంచ్ బండి శ్రీనివాస్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు చెట్కూరి కమాలకర్ యాదవ్, బెక్కల్ సర్పంచ్ కూకట్ల బాలరాజు యాదవ్, మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, నాయకులు మల్లేశం, శ్రీధర్‌రెడ్డి, కనుకచంద్రం, పద్మారెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.


బచ్చన్నపేట: ఆరు గ్యారంటీల కార్డును అందజేస్తున్న సాయిప్రియాంక


జనగామ: కాంగ్రెస్‌లోకి మైనార్టీలను ఆహ్వానిస్తున్న ప్రశాంత్‌రెడ్డి

'కొమ్మూరి'ని గెలిపించండి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మండలంలోని తపాస్‌పల్లి, అయినాపూర్, కొమురవెల్లి, కిష్టంపేట, లెనిన్‌నగర్ గ్రామాల్లో మాజీ జెడ్పీటీసీ దాసరి కళావతి ఆధ్వర్యంలో గురువారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అయినాపూర్ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి, మహాదేవుని శ్రీనివాస్, లింగంపల్లి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతాప్‌రెడ్డితోనే జనగామ అభివృద్ధి

జనగామ: స్థానికుడైన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితోనే జనగామ సంపూర్ణంగా అభివృద్ధి చెందుతుందని ఆయన కోడలు దివ్య అన్నారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బనుక శివరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో పట్టణంలోని 5వ వార్డు, కోర్టు ఏరియా, గోకుల్ నగర్, బృందావన్ కాలనీల్లో గడప గడపకు ఆమె ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేయనున్న ఆరు గ్యారంటీ పథకాలు, ఇతర సంక్షేమ పథకాలను వివరిస్తూ చేతి గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. యూత్ కాంగ్రెస్ నాయకులు బత్తుల శ్రీనివాస్, బైరగోని రఘు గౌడ్, శివ, రాజు, మారబోయిన రాంచందర్ పాల్గొన్నారు.

మైనార్టీల చేరిక..

పట్టణానికి చెందిన కాంగ్రెస్ మైనార్టీ నాయకులు జమాల్ షరీఫ్, యూత్ లీడర్ ఎండి రఫీమతిన్ ఆధ్వర్యంలో జరిగిన చేరికల కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా యువ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. గిర్నిగడ్డకు చెందిన బీఆర్ఎస్, సీపీఎంలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. చారబుడ్ల రాందయాకర్‌రెడ్డి, కౌన్సిలర్ ముస్త్యాల చందర్, అబ్దుల్, మన్నన్ పాల్గొనగా, కాంగ్రెస్‌లో చేరిన వారిలో అమ్మన్, అస్లం, శ్రీకాంత్, నితిన్, నవీన్, ఫరీదా, శానాజ్, పర్వీన్, నర్సింగ్, అజమ్, శంకర్, రాములు, సత్యనారాయణ, భరత్, నరసింహ, సాల్మన్ శానవాజ్, బాబు ఉన్నారు.

కొమ్మూరి కూతురు ప్రచారం

బచ్చన్నపేట: నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటు పడే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని ఆదరించి గెలిపించాలని ఆయన కూతురు సాయిప్రియాంక కోరారు. గురువారం మండలంలోని కేసిరెడ్డిపల్లిలో కాంగ్రెస్ నాయకులు, మహిళలతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఆదరిస్తే అన్ని విధాలా అభివృద్ధి


ప్రచారంలో మాట్లాడుతున్న ఆరుట్ల దశమంతరెడ్డి


ప్రజలను ఓటు అభ్యర్థిస్తున్న ఆరుట్ల

- బీజేపీ మేనిఫెస్టోలో అన్నివర్గాలకు సముచిత స్థానం
- పార్టీ జనగామ అభ్యర్థి దశమంతరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ఆదరించి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని బీజేపీ జనగామ అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండల పరిధిలోని ముస్త్యాల, వీరన్నపేట, చుంచనకోట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీర్ఘకాలిక ప్రయోజనాలతో బీజేపీ మేనిఫెస్టో విడుదల చేసిందన్నారు. మేనిఫెస్టోలో వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, బీసీలు, ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేసిందని తెలిపారు. విద్య, వైద్యం, పరిశ్రమల పురోగతి చేపడతామని వివరించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు వారి హయాంలో నియోజకవర్గానికి ఏం చేయలేక పోయారని విమర్శించారు. రెండు దశాబ్దాల పరిపాలనలో చిన్నాచితకా పనులు తప్ప జనగామలో అభివృద్ధి జరగలేదన్నారు. ప్రజల అభిమానం, తనపై ఉన్న నమ్మకమే ఎన్నికల్లో గెలిపిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

జనగామ: పట్టణంలోని 16వ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు కాసర్ల శంకర్ గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి అక్కడకు వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అంతకు ముందు మృతదేహంపై పుష్పగుచ్ఛం వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. అలాగే బచ్చన్నపేట మండలంలోని లక్ష్మాపూర్ జీపీ పారిశుద్ధ్య కార్మికుడు పిడుగు ఎల్లస్వామి అనారోగ్యంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పల్లా పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

నీలిమ ఆస్పత్రిలో ఉచిత వైద్య సేవలు

పట్టణంలోని 16వ వార్డుకు చెందిన వనం నర్సింగరావు లివర్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతుండడంతో మెరుగైన వైద్య పరీక్షల కోసం హైదరాబాద్‌లోని పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన నీలిమ ఆస్పత్రికి తరలించారు. పల్లా సొంత ఖర్చులతో వైద్యుల పర్యవేక్షణలో ఐసీయూలో చికిత్స అందజేస్తున్నట్లు వార్డు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఆర్థికసాయం

నర్మెట: మండలంలోని రామచెంద్రు తండాకు చెందిన బీజేపీ గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి భూక్య సాయి తండ్రి గేమియా మృతి చెందాడు. కాగా, బీజేపీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరుట్ల దశమంత్‌రెడ్డి పంపించిన ఆర్థిక సాయం రూ.10 వేలను ఆ పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ రాజు నాయక్ గురువారం అందజేశారు. నాయకులు ధరావత్ వినోద్, జహంగీర్, రాజు, నాగేష్, నరేష్ ఉన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

మండలంలోని మచ్చుపహాడ్ గ్రామానికి చెందిన మానుపాటి మల్లయ్య మృతి చెందాడు. కాగా, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి పంపించిన ఆర్థికసాయాన్ని సర్పంచ్ రామిని శివరాజ్ అందజేశారు. నాయకులు వస్పరి రాజు, వెంకటయ్య, రాజు, రాజశేఖర్, దేవరాజు, రవి, మురళి, సత్తయ్య, కనకస్వామి, సిద్దయ్య, పర్షరాములు పలువురు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు విస్మరించిన పార్టీలు

జనగామ రూరల్: ప్రజా సమస్యలు విస్మరించిన పార్టీలకు ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని జనగామ సీపీఎం అభ్యర్థి మోకు కనకారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని యశ్వాంతాపూర్, శామీర్‌పేట, ఓబుల్‌కేశావాపూర్, పెద్దరాంచర్ల, గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. సీపీఎం పార్టీకి ఓటు వేసి ప్రశ్నించే గొంతుకను అసెంబ్లీకి పంపాలని విజ్ఞప్తి చేశారు.

కారు - ఆటో ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

నర్మెట: ఎదురెదురుగా వస్తున్న కారు, ఆటో ఢీ కొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరి వ్యక్తులకు తీవ్ర గాయాలైన ఘటన గురువారం నర్మెట తహసీల్దార్ కార్యాలయం వద్ద రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వెల్దండకు చెందిన కల్యాణం కనకయ్య తన ఆటోలో కిరాయికి హనుమకొండకు వెళ్తున్నాడు. తరిగొప్పుల మండలం బొత్తలపర్రెకు చెందిన చందులాల్ కారులో ఎదురుగా వస్తూ ఆటోను ఢీకొట్టడంతో కనకయ్య తలకు చేతికి, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ఆటోలో ప్రయాణిస్తున్న మదురమ్మ తలకు త్రీవగాయమైంది . గమనించిన స్థానికులు వెంటనే జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

నివాళి

పాలకుర్తి: మండల కేంద్రంలో జీడి సోమయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి దయాకర్ రావు సతీమణి ఉషాదేవి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ధర్మ సమాజ్ పార్టీ విస్తృత ప్రచారం

జనగామ రూరల్: అడవికేశాపూర్‌లో గురువారం ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి గొల్లపల్లి చిరంజీవి విస్తృతంగా ప్రచారం చేపట్టా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ర కులాల అధిపత్యంలో బడుగు బలహీన వర్గాలు అనగదొక్కబడుతున్నారని అన్నారు. ధర్మసమాజ్ పార్టీ టార్చ్‌లైట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

బీఆర్ఎస్‌లో చేరిక

జనగామ రూరల్: మండలంలోని చౌడారం, మరిగడి, పెద్దతండ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ ఎంపీటీసీ మహేశ్వరిశ్రీనివాస్ ఎంపీపీ కళింగరాజు ఆధ్వర్యంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

గిరిజనులకు రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి


మాట్లాడుతున్న శంకర్‌నాయక్

జనగామ రూరల్: నారాయణఖేడ్ కాంగ్రెస్ పార్టీ సభలో సేవాలాల్ సేన బహూకరించిన ఫొటోను తిరస్కరించి వ్యవహరించిన తీరు సరికాదని, వెంటనే గిరిజనులకు రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపన చెప్పాలని సేన జిల్లా అధక్షుడు ధరావత్ శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బంజారాల ఆరాధ్యదైవ్యం అయిన సేవాలాల్ మహరాజ్ ఫొటోను బహూకరించడానికి వెళ్తే తీసుకోకుండా అసహ్యాంచుకోవడం , ఫొటోను నెట్టి వేయడం బంజారాలను అవమాన పర్చినట్టేనని అన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తునట్లు తెలిపారు. నాయకులు మహేందర్, రాజు, రంగయ్య, విజయ్‌కుమార్, రవీందర్, భిక్షపతి, రమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు


చిల్పూరు: తీగలతండాలో మాట్లాడుతున్న ఇందిర, పక్కన చారులత


లింగాలఘణపురం: బైక్ ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ అర్చిత

- కాంగ్రెస్ ఘన్‌పూర్ అభ్యర్థి ఇందిర

చిల్పూరు: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నెల రోజులోనే 6 గ్యారంటీలు అమలు చేస్తామని పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి సింగపురం ఇందిర అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఏఐసీసీ ఎన్నికల అబ్జర్వర్ చారులతతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదేళ్లలో చేయలేని అభివృద్ధిని ఎన్నికలు ముగియగానే చేస్తామని బీఆర్ఎస్ నాయకులు ప్రకటించడం శోచనీయమన్నారు. చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కాగా, వివిధ పార్టీల నాయకులు ఇందిర సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్, తీగల మహేందర్, యశ్వంత్‌రెడ్డి, సాదం గట్టయ్య, యాదవరెడ్డి, ఇల్లందుల యాదగిరితోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఇందిర తరపున కూతుళ్ల ప్రచారం

లింగాలఘణపురం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి రాగానే నిరుద్యోగ యువతకు నోటిఫికేషన్లు మొదలవుతాయని ఇందిర కూతుర్లు డాక్టర్ అర్పిత, అలేఖ్య అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిలీప్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అనిల్, మండల అధ్యక్షుడు సంపత్ పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: కాంగ్రెస్ అభ్యర్థి సింగపురం ఇందిరను గెలిపించాలని కోరుతూ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారాన్ని గురువారం నిర్వహించారు. కాగా, షాపల్లి, జఫర్‌గఢ్‌కు చెందిన పలువురు ఇందిర సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువ కప్పి పార్టీలోకి అహ్వానించారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం

స్టేషన్‌ఘన్‌పూర్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సింగపురం ఇందిర గెలుపు ఖాయమని జెడ్పీటీసీ మారపాక రవి అన్నారు. మండలంలోని విశ్వనాథపురంలో రవి ఆధ్వర్యంలో గురువారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. అనంతరం బీఆర్ఎస్ యూత్ నాయకుడు కంజర్ల అశోక్‌తో పాటు దాదాపు ముప్పై మంది రవి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు అక్కిరెడ్డి సంపత్‌రెడ్డి, మాలోతు శ్రీను, పూంద్ర తిరుపతిరెడ్డి, గుర్రపు సరోజన, మొలుగూరి రేవతి, గుర్రపు యాదమ్మ, హేమలత, ఎల్లయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల అస్తిత్వాన్ని కాపాడుకోవాలి

ధర్మసాగర్: మాదిగల అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి, మాదిగలందరూ ఏకతాటిపైకి వచ్చి సింగరపురం ఇందిరను గెలిపించాలని దళిత సంఘాల నాయకుడు బొల్లెపాక రాజేష్ కోరారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పట్ల మహేష్, బైరపాక బాలస్వామి, రాజు, రాకేష్ పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న గంగసాని రంజిత్‌రెడ్డి

లింగాలఘణపురం: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా నిర్మించే సాయిబాబా ఆలయ నిర్మాణానికి గురువారం మాజీ జెడ్పీటీసీ గంగసాని రంజిత్‌రెడ్డి భూమిపూజ చేశారు. సొంత ఖర్చులతో ఆలయ నిర్మాణం పూర్తి చేస్తానని, అందుకు గ్రామస్తులు, కాలనీవాసుల సహకారం కావాలని కోరారు. వేదపండితులు ఉమానాథశర్మ మంత్రోచ్చారణలతో ప్రారంభించగా సర్పంచ్ విజయ్‌మనోహర్, స్థానిక ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు పుల్కరం నాగరాజు, సభ్యులు తదితరులు ఉన్నారు.

రూ.లక్ష విరాళం..

జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి గుడి నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేస్తానని ప్రకటించారు. ఎంపీటీసీ భిక్షపతి, నాయకులు పాల్గొన్నారు.